ఎఫ్. ఆర్. బోర్డు మాత్రమే తగిలించుకుని, నిజానికి ఊరి పొలిమేరలు దాటి పోకూడదు, కానీ అదో మొండి ధైర్యం, నన్నెవరు పట్టుకోవచ్చారూ అని! అంతగా ఏ ఎర్రటోపీ అన్నా అటకాయిస్తే, వో పది మనది కాదనుకుంటే సరిపోతుంది కదా అన్న నమ్మకం లోలోపల. దానికితోడు "ఏడువేలు పై చిలుకు దాని మొహానపోశారు. నన్నెట్లాగూ వెనకెక్కించుకొని బయటకు వెళ్ళడానికి మీకు బిడియం అనుకోండి, కనీసం పిల్లల్నయినా సరదాగా అల్లా తిప్పుకు రారేం?" అని ఇంట్లో రుక్మిణి సతాయింపు.

పెద్దవాడు శాండిల్యకు, ఆ మోటారుసైకిలు నేను బయటకు తీసినప్పుడెల్లా, తనను వెనక కూచోమంటానేమోనని కొండంత ఆశ. "నాన్నారూ! చక్రాలు తుడవనా?" అంటాడు. "కార్బన్ క్లీన్ చేశాను డాడీ!" అంటాడు మరో సారి. ఏమాటకు ఆమాటే చెప్పుకోవాలి. నాకూ రుక్మిణిని పిలియన్ సీటుమీద కూచో పెట్టుకుని, పైటచెంగు పైరగాలితో సరస మాడుతుంటే, నలుగురూ నావేపు ప్రశంసా నేత్రాలతో, అసూయతో చూస్తూవుంటే, రంయిమని ముందుకు దూసుకుపోదామనే వుంటుంది.

## కొండముది శ్రీరామచంద్రమూర్తి

# పార్ట్‌నర్స్



కానీ మోటారు సైకిలు కొన్న తర్వాత, నా సైకిలు క్రిందనే రెండుమూడుసార్లు నేనుపడి, ముందుపన్ను కొంచెం వూడగొట్టుకొని, మొహంమీద పట్టీలేసుకుని, ఒకటి రెండు సార్లు దాన్ని తిట్టి, నన్ను తిట్టుకుని, చచ్చిచెడీ డ్రయివింగ్ వచ్చిందనిపించుకుని, టెంపరరీ లైసెన్స్ సంపాయించుకున్నాను.

మావూరు, పల్లెపల్లె పట్నం షోకులు చేసుకున్నట్టుగా వుంటుంది. వీధులు యిరుకు, మనుషులు మురికి. ఈవూళ్లో నాకు వచ్చే జెబుకు. నిన్న సాయంకాలం మా స్వస్థలం నుంచి వో ఉత్తరం వచ్చింది. గంగా భాగీరథీ సమానురాలయిన మా పెద్దఅమ్మమ్మ చిన్న కూతురి మూడో మనవరాలు కాలం చేసిందని! తొమ్మిదోరోజు కర్మ ప్రారంభిస్తున్నామని, పదోరోజు తర్పణం విడవడం పదిమందీ కర్తవ్యం అనీ!

పదోరోజు ఆదివారమే అయింది. పర్వా లేదు. కానీ సోమవారం ఉదయానికల్లా నేను కాలేజిలో వుండితీరాలి, పబ్లిక్ పరీక్షలు ఎనిమిదింటికే ప్రారంభం. ఇన్‌విజిలేషన్ వర్క్ తప్పించుకోవడం సాధ్యంకాలేదు. మనసులో ధైర్యం సంగతి ఎట్లావున్నా, కాస్త వొడ్డూ పొడుగూ వున్నవాణ్ని, కుర్రవాళ్ళతో సంయ్యమంటే సంయ్యి మనగలవాణ్ని నేను ఒక్కణ్నే అని ప్రిన్సిపాలు నమ్మకం.

"మరూ! తర్పణాలకు వెళ్ళకపోతేఏం?" అన్నాను, శనివారం సాయంకాలం కాలేజీ నుంచి ఇంటికి వచ్చింతర్వాత.

"అదేమిటండీ! గాయత్రికి మీకన్నా ఐన వాళ్ళెవరూ?" అన్నది ఒక్కింత ఆశ్చర్యంగా.

"నిజమే గానీ! పొద్దున్నే ఆ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళి, ఒంటిగంటకు తర్పణాలు విడిచి, ఏ మూడింటికో భోజనాలుచేసి, మళ్ళీ ఒప్పుని సరిగా ఈవెనింగ్ ఎక్స్‌ప్రెస్ క్యాచ్‌చేసి, అర్ధరాత్రి కొంపకు చేరుకోవడం యెంత స్ట్రెయినో ఆలోచించావా?"

"స్ట్రెయిన్ అన్నది ఒప్పుకుంటాను. కాని, తప్పనిసరి!"


# శ్రీ బాలాజీ వైద్యశాల



## సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్: 551, తెనాలి (ఎ. పి.)

బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.


## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అంగము చిన్నదగుట, సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది) స్వప్నులు, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులు, హెర్నియా (గిలక), పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. ఉబ్బసం, క్షయ, ఆయాసం దగ్గులకు ఉచిత వైద్యం - రండి.

వరిబీజము (బుడ్డ), హెర్నియా, మూత్ర వ్యాధులు, ఆపరేషన్ లేకుండా బాగుచేయబడును. స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

బ్రాంచీలు:- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

## పార్ట్‌నర్స్




మనసులో అంత ఇష్టంగా లేకపోవడంచేత గామోసు, మా పెద అమ్మమ్మ సైనుపంచ కట్టుకుని, నెత్తిన ముసుగేసుకుని, గుడ్లుపత్తి కాయలంతేసి చేసి నావేపు కోపంగాచూస్తూ, బోసినోటి చప్పిదవడలను అటూయిటూ భీకరంగా కదుపుతూ, "ఏరా రావుడూ! రావం టున్నావేవిటీ! సైకిలు కొన్నావుగా, పెద్దాణ్ని కూడా దానిమీదెక్కించుకురా! - ఏం వస్తావుగా రాకపోతే నేనూరుకోను. నా సంగతి తెలుసుగా" అంటూ కల్లోకొచ్చి, ఆ కలలోనే గాలిలో కలిసిపోయింది.

గబుక్కున లేచిచూస్తే అర్థరాత్రి. కటిక చీకటి. దూరంగా పక్షులేవో వికృతంగా కూస్తున్న చప్పుళ్ళు. గుండె బలహీనంగా కొట్టుకుంటున్నది. మొహాన కమ్ముకున్న చెమట చేతిని తడిచేసింది.

అప్పటికప్పుడు ప్రక్కమంచంమీద పడుకున్న రుక్మిణిని తట్టిలేపాను. "ఇప్పుడు నన్ను డిస్టర్బ్ చేయకండి" అంటూ అటుతిరిగి పడుకుంది. అతి కష్టంమీద లేపి కూచోబెట్టి, లైటువేసి, ఇదీ సంగతి. అందుచేత తెల్లవారుఝామునలేచి, మోటారు సైకిలు మీద, శాండిల్యనుకూడా వెంటతీసుకుని బయల్దేరతాను. ఏమంటావ్?" అన్నాను.

"శుభమా అని కొత్తబండీ మీద చావు చోటు కెందుకండీ?" అన్నది రుక్మిణి నిద్ర కళ్ళతోనే.

"అక్కడ చావుసంగతి ఏమోకానీ, ఎల్లుండి పొద్దున్న పరీక్షహాల్లో నేను కనపడకపోతే ప్రిన్సిపాలు ముందు నన్ను చంపుక తింటాడు. లెక్చరర్స్‌ను చంపుకు తినడం ఇప్పటి ప్రిన్సిపాల్స్‌కో స్పెషల్ హాబీ!"

"మీరు వెళ్ళితే వెళ్ళరండి, చంటికూడా దేనికి?"

"నాకు కంపెనీ!"

"మీకు డ్రయివింగ్ రాదంటారుగా?—— ఏదన్నా ఆక్సిడెంటయితే ..."

"అర్థరాత్రిపూటా ఆ అపశకునం మాట లేవిటే——శకునపక్షిలాగా?"

"ఉన్నమాటంటే ఉలుకెక్కువే లెండి!" కోపంగా లైటు ఆర్పేసి, అటుతిరిగి పడుకుంది.

మర్నాటి పొద్దున్న మోటారుసైకిల్‌ను కిక్

ఇస్తుంటె, పక్క యింటివారి పనిమనిషి పుటుక్కుమని తుమ్మింది. ఆ తుమ్ముకు భయపడ్డట్లుగా మోటారు సైకిలు ఒక్కమూలుగు మూలిగి, పెద్దగా సకిలించి, స్టార్టయింది.

"ఏమండీ! తప్పదా?" అన్నది కాఫీకప్పుతో ఎదురువచ్చిన రుక్మిణి.

"ఎదురుగా నువ్వొస్తే, ఇహ నాకు అంతా మంచే!"

జావా ముందుకు రోడ్డుమీదకు ఒక్కదూకు దూకి, విజయవాడ వైపుగా ఆఘమేఘాల మీదుగా దూసుకుపోతున్నది. మెత్తని వెడల్పు రోడ్డు, ఒంటిని స్పృశిస్తూ చల్లనిగాలి, వెనగ్గా పెద్దవాడి మాటలు. తూర్పువేపు ఆకాశం నెత్తురు కొలనులావుంది. సూర్యుడు రక్తపు ముద్దలా వున్నాడు. విజయవాడకు వచ్చే టర్నింగ్‌లో, వూరిబయట ఆ సూర్యుడే పాలిపోయిన పేషెంటులా కనిపించాడు.

ఎదురుగ్గా పదిపదిహేను గేదెలు, అటూయిటూ అడ్డదిడ్డంగా నడుస్తున్నాయి. ప్రక్కనే టీకొట్లలో ఇడ్లీలుతింటూ కాఫీలు తాగుతున్నారు కొందరు గడబిడగా మాట్లాడుకుంటూ.

శాండిల్య ఆరోజే విడుదలవుతున్న వో అక్కినేని సినిమా విశేషాలు వివరిస్తున్నాడు మనోజ్ఞంగా.

ఇంతలో టీ కొట్లోనుంచి వో ముసిల్ది ఆదరాబాదరా రోడ్డుమీదకు పరిగెత్తుకువచ్చింది అటునుంచి యిటుకు, తడబడుతున్న అడుగులతో. రోడ్డుకు అడ్డంగా గేదెలు, గేదెలకూ రోడ్డుకూ నా మోటారు సైకిలుకూ అడ్డంగా ఆ ముసిల్ది. ఆరిన కుంపటిలాంటి ఆ ముసిల్దానికీ నాకు వో గజమైనాలేదు.


ముందుగా ఫ్రంట్‌బ్రేక్ వేశాను. వెంటనే బ్యాక్‌బ్రేక్ నొక్కాను. క్లచ్ రిలీజ్ చేయడం మర్చిపోయాను. మోటారు సైకిలు గీమంటూ ఒక్క యెగురు యెగిరింది గాలిలోకి. "నాన్నారూ!" అంటూ వెనుకనుండి పెద్దగా కేక. ఆ కేకకు తోడుగా ఎదురుగా "అయ్యో నాయనో!" అంటూ పడిపోయిన ముసిల్ది. ఎదురుగానె చూచానో, వెనక్కి తిరిగానో చేతులు హాండిల్ మీదినుంచి వదిలేశాను, మోటారు సైకిలు కిందపడిపోయింది.

నలుగురూ బిలబిలా పోగయ్యారు. ముప్ఫయ్యేళ్ళ ఓ యువకుడు పెద్దగా ఏడుస్తున్నాడు. "నన్ను పెట్టి వెళ్ళబోకే, వో మామ్మో!" అంటూ. శాండిల్యకు చేతులమీదా, కాలిమీదా గాయాలయినాయి. కళ్ళుతెరచి చూసేసరికి బాధగా వాడు కిందపడిలేస్తూ కనిపించాడు. నా కళ్ళు మండిపోతున్నాయి. మొహం మీదంతా చిమచిమగావుంది.

ఎక్కడ్నుంచి వచ్చాడో ఓ పోలీసు వచ్చాడు. అందర్నీ అటూయిటూ సర్దాడు. "ఆ ముసిల్దానికో మంచం వెయ్యండెహే!" అన్నాడు అధికార పూర్వకంగా. పక్కనున్న వో సోడాకొట్టు వాడితో, నర్సింలూ, ఈళ్ళందరకూ ముందస్తుగా నాలుగు సోడాలు కొట్టే" అన్నాడు మళ్ళీ.

ఇంకా ఆ ముప్ఫయ్యేళ్ళ యువకుడూ పెద్దగా ఏడుస్తోనే వున్నాడు. "ఏందిరా, అట్టా గేడుత్తావ్, ఆడదానిలాగా! వూర్కోవూర్కో! పొద్దున్నే ఎవరిమొహం చూశావో, అదురెట్టమంతుడివి, గాయాలే కాత్తమోపుగా తగిల్నాయ్ నీ యవ్వకు. అయ్యగోరు డబ్బులిత్తారుగానీ, వైద్దిగెం సేయించు పోయి, దానికి కొత్తజావ కాపించు, పో!" అని నావైపుకు తిరిగి, "ఏం సాబ్, దానికో యాభై రూపాయలిప్పించండి." అన్నాడు.

ఆ కానిస్టేబులు నోటుబుక్కుతీసి మోటారు సైకిలు నంబరు 'నోట్' చేసుకోడానికి ప్రయత్నంచేస్తే, నంబరు కనిపించక అదో నేరం, టెంపరరీ లైసెన్సుతో ఊరిపొలిమేరలు దాటడం మరోనేరం, వీటికితోడు ఏక్సిడెంట్ నేరం, ఎలారా భగవంతుడా అని లోలోపల ఒకటే మదనపడుతున్న నాకు, వీటిగురించి పట్టించుకోకుండా "యాభయి రూపాయలిప్పించండి" అని అతనడగడం నెత్తిన పాలుపోసినట్లయింది. వెంటనే అడిగినంతా ఇచ్చేశాను, మరోమాటలేకుండా.




డబ్బు తీసుకుంటూ అతను నావేపుచూసి నవ్వాడు. అతనెందుకు నవ్వాడో నాకు తెలీలేదు.

డబ్బుచూడగానే ఆ యువకుడి ఏడుపు ఆగిపోయింది. ముసిల్దాని మూలుగు సన్నబడింది.

"రండిసార్, మిమ్మల్నీ, అబ్బాయిగార్నీ అమెరికన్ ఆస్పిటల్కు తీసుకువెళతాను" అన్నాడు మళ్ళీ ఆ కానిస్టేబులు.

"నా మోటారు సైకిలు " నాలో సన్నగా గొణుగుడు.

"ఏం ఫర్వాలేదు. అదిక్కడే పడుంటుంది లెండి!" దాన్ని తిట్టాడు వో బూతుమాట.

అమెరికన్ ఆస్పత్రిలో ఓ నర్సు అతన్ని చూడగానే, "ఏం బ్రదర్! ఇవ్వాళిది మొదటి కేసా?" అన్నది కళ్ళుచికిలిస్తూ. ఆ కానిస్టేబులు కాస్తసిగ్గుపడ్డాడు. అంత బాధలోనూ వాళ్ళిద్దర్నీ చూస్తే నాకు ఎంతో ముచ్చటేసింది. ఆ సిస్టర్ కాశ్మీర్ ఆపిలులాగావుంది. ఆమె కళ్ళు విశాఖపట్నం కొండసంపెంగల్లా వున్నాయి. ఆమె యౌవనం కొంటెగావుంది. కానిస్టేబులు ఆమె భక్తుళ్లా వున్నాడు. వీలయితే "నీ దాసును కాల్మొక్తా!" అనేంత వినయం వొలికిస్తున్నాడు, డాక్టర్ దగ్గర. ఆ తర్వాత ఆనర్సు నన్నూ శాండిల్యనూ డ్రెస్సింగ్ రూంలోకి తీసుకువెళ్ళి చెరో రెండు ఇంజెక్షన్లు చేసింది. టాబ్లెట్లు నోట్లో వేసింది. మొహానా, చేతులమీదా, కాళ్ళమీదా మందుపూసి, ప్లాస్టరు పట్టీలు అంటించింది.

ఆమె ఆ పనులు చేస్తున్నంతసేపూ ఆ కానిస్టేబులు ఆమెను అంటి పెట్టుకునేవున్నాడు. ఆమె తెల్లని గౌనునూ, ఆమె తెల్లని ఒంటినీ పూసుకుని పూసుకుని తిరిగాడు. డ్రెస్సింగ్ అయింతర్వాత, "పాపం మీకోసం చాలా కష్టపడ్డది సార్!" అన్నాడు.

"అవునుగానీ సిస్టర్! నేనిక్కడ వుండాలా, వెళ్ళిపోవచ్చా?" అని అడిగాను.

"మహారాజులా వెళ్ళిపోవచ్చు." ఆమె మాటల్లో అదే కొంటెతనం. ఆ నల్లని కళ్ళల్లో ఆకర్షించే—అదే నవ్వు.

ఆమె అక్కడ వుండమంటుందనుకున్నాను అనలేదు. నిరాశ. ఆమెకు ఎంతిస్తే బావుంటుంది. అదో సందేహం.

"ఏవయ్యా! కానిస్టేబుల్—ఎంతిస్తే బావుటుందంటావ్?" రహస్యంగా అడిగాను.

"ఇద్దరికి ట్రీట్మెంట్ కదుసాబ్! ఓ

యాభయి అన్నా ఇవ్వండి."

"యాభయ్యా! సాలెగూటిలో చిక్కుకున్న పురుగులా కటకటపడ్డాను. అయిదుపదులూ యిచ్చి, థాంక్స్‌చెప్పి బయటకు వస్తుంటే, కానిస్టేబులు ఆమెదగ్గరకు వెళ్ళి ఆమె అర చెయ్యి గిల్లడం, ఆమె కిసుక్కున నవ్వడం నాకు కనిపించింది. "అదృష్టవంతుడవోయ్ కానిస్టేబులూ!" అనుకున్నాను మనసులోనే. "మళ్ళీరండి!" అంటూ వినిపించింది సన్నని ఆ నవ్వుగొంతు వెనుకనుండి.

"నేను రాను!—ఆ కానిస్టేబులు తప్పకుండా వస్తాడు!" అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాను. ఆ కళ్ళల్లో ఎంత అయస్కాంతమో!

యాక్సిడెంట్ జరిగిన చోటికి తీసుకువచ్చి, మా యిద్దర్నీ అక్కడ వదలి, "సాబ్ కేసూ గీసూ వద్దు. ఓ యాభై యివ్వండి. నే పోతా!" అన్నాడు కానిస్టేబులు.

అంతవరకూ అతని మంచితనంమీద నేను పెంచుకున్న గౌరవం ఆ ఒక్కమాటలోనూ విశ్లథమైంది.

"యాభయ్యా?!"

"అవును సాబ్!—కోర్టుకు వెళ్తే, ఎంత నష్టం, ఎంత కష్టం!!"

మాట్లాడకుండా యాభై ఇచ్చి, "థాంక్స్!" అన్నాను కటువుగా. అతను డబ్బు అందుకున్న మరుక్షణం సైకిలెక్కి గుణదలవైపుగా వెళ్ళిపోయాడు.

మోటారు సైకిలు స్టార్టు చెయ్యబోయాను. చేతివేళ్ళు స్వాధీనంలో లేవు. హేండిల్ ఎత్తడమే కష్టంగా వుంది. శాండిల్య నాకు సహాయపడేస్థితిలో లేదు.

"షల్ ఐ హెల్ప్ యూ?"

తల తిప్పి చూశాను. ఆ ముసిలాని మనవడు. అరుగుమీదకు చూశాను. ఆ ముసిల్ది టీ కొట్లో కూచుని, ఖల్లు ఖల్లుమని దగ్గుతుంటూ టీ తాగుతోంది.

"మీ అవ్వకు.   "

"షి ఈజ్ ఆల్‌రైట్!" ఆ యువకుడు ఇప్పుడు నీట్‌గా పైకి దువ్వాడు. గళ్ళ చొక్కా టక్ చేశాడు. బెల్‌బాటమ్ ట్రౌజర్స్‌లోకి "ఆమె నాకు అవ్వాకాదు, ఆమెకు నేను మనవణ్ని కాదు, అడవిలోని ఉసిరికాయా, ఏటి పక్క ఉప్పుకల్లూ. అంతేసార్! మాదో లివింగ్ పార్టనర్‌షిప్!"

"యూ స్కౌండ్రల్!" నాకు కోపం ఆగలేదు.

"నన్ను తిట్టకండి. ఐ యామ్ ఎ గ్రాడ్యుయేట్! ఉద్యోగంకోసం తిరిగి తిరిగి ఇప్పుడీ ఉద్యోగం చేస్తున్నాను. ఇప్పుడీ ఉద్యోగంలో ఎంతమందో తెలుసా సార్ పార్టనర్స్? నేను, ఆ గ్రాండీ, మీకు హెల్ప్ చేసిన కానిస్టేబిల్, ఇంజక్షనిచ్చిన నర్స్ యస్ ఆర్. బోర్డులు తగిలించుకుని, సరదాగా ఊళ్ళవెంట బయల్దేరతారే, మీరే మా కస్టమర్స్! అర్థమైందా సార్?—బై దిబై, మీ రిప్పుడు డ్రైవ్ చెయ్యలేరు. సహాయం చెయ్యమంటారా?"

"చేసిన సహాయం చాల్లే!" అందామనిపించింది. కానీ అనలేదు. ఈ రాబందుల దేశంలో ఉదర పోషణార్థం బహుకృత వేషధారణలు.

"ఎంతీమంటావ్?"

"ఎనదర్ ఫిఫ్టీ!"

"ఇట్ ఈజ్ టూ మచ్!"

"మా దగ్గర బేరాలుండవు సార్! అంతా ఫిక్సెడ్ ప్రైయిసెస్. యాక్సిడెంటుకు యాభై!" ఇంజన్ స్టార్టుచేసి "ఎక్కడకు పోదాం సార్?" అని అడిగాడు ఆ యువకుడు.

"వెనక్కి, ఇంటికే పోనీ!"

ఇంట్లో రుక్మిణికి జరిగిన భాగోతమూ, నా తెలివితేటలూ తెలియజెప్పవద్దని శాండిల్యతో అందామనుకున్నాను. కానీ ఏదో ఆభిజాత్యం నా గొంతు నొక్కేసింది. మోటారుసైకిలు దిగీ దిగకుండానే, "అమ్మా! మరేమోనే  " అంటూ వాడు, అంత బాధపడుతూనూ, అసలు కథంతా చెప్పేశాడు.

అంతా విన్న రుక్మిణి కళ్ళల్లో ఒక కంట్లో జాలి, మరో కంట్లో ఎగతాళీ.

"పాడు బండీ అమ్మేద్దాం అండీ! మనకిది అచ్చిరాలేదు" అన్నది వొంటికి వేడినీళ్ళలో కాపటం పెడుతూ. ☐